అక్కచెల్లెమ్మలకు ఆసరా వెలుగు



గొరపల్లిలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న బొడ్డు ఆదిలక్ష్మి

పెందుర్తి మండలం గొరపల్లి పంచాయతీకి చెందిన బొడ్డు ఆదిలక్ష్మి గ్రామంలోని సాయిలక్ష్మి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. ఈ గ్రూప్‌లో మొత్తం 14 మంది సభ్యులు ఉన్నారు. వీరి గ్రూపు పేరిట బ్యాంక్ రుణం రూ.5 లక్షలు ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ ఆసరా ద్వారా ఈ సంఘానికి రూ.3,70,060 రుణ మాఫీ అయింది. ఆదిలక్ష్మికి మొత్తం రూ.40,200 మాఫీ అయింది. దీంతో పాటు బ్యాంక్ నుంచి రూ.1,50,000, సంఘంలో అంతర్గత రుణం రూ.50 వేలతో కలిపి రూ.2.10 లక్షలతో గ్రామంలో వాటర్ ప్లాంట్ నెలకొల్పింది. ప్రస్తుతం ఆమె ఆర్థికంగా నిలదొక్కుకుంది.

ఇలా ఒక్క ఆదిలక్ష్మి మాత్రమే కాదు..పెందుర్తి నియోజకవర్గంలో ఇలాంటి విజయగాథలు మరెన్నో ఉన్నాయి.

- 50,934 మంది లబ్ధిదారులకు రూ.149.04 కోట్ల లబ్ధి
- నియోజకవర్గంలో 4827 ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు పథకం వర్తింపు

పెందుర్తి: రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలన్న లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను మాఫీ చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణాలను మాఫీ చేసి మహిళలకు కొండంత అండగా నిలుస్తున్నారు. తొలి మూడు విడతలు విజయవంతంగా అమలు చేసిన ప్రభుత్వం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మొత్తం నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నియోజకవర్గంలోని 4,827 స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 50,934 మంది సభ్యులకు రూ.149.04 కోట్లు లబ్ధి చేకూరింది.

ప్రతి ఇంటికీ పండగే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ద్వారా అక్కచెల్లెమ్మల కష్టాలు నేరుగా తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు చెల్లించలేని పరిస్థితిని గమనించారు. దీంతో అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రకటించారు. తద్వారా 2019 ఏప్రిల్ వరకు ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేసి ఆయా నగదును నేరుగా లబ్ధిదారులైన అక్కచెల్లెమ్మల చేతికే నాలుగు విడతల్లో అందిస్తామని ప్రకటించారు. ఆ మాట నిలబెట్టుకుంటూ రుణమాఫీ ఫలాలు అందించారు. దీంతో మహిళలు ఎంతో సంబరపడుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

మండలాల వారీగా వైఎస్సార్ ఆసరా లబ్ధి వివరాలు

మండలం	గ్రూపులు	సభ్యులు	లబ్ధి
పెందుర్తి	672	6891	రూ.4.71 కోట్లు
సబ్బవరం	1764	18,922	రూ.54.10 కోట్లు
పరవాడ	1143	12641	రూ.51.69 కోట్లు
జీవీఎంసీ			
93వ వార్డు	161	1610	రూ.4.64 కోట్లు
94వ వార్డు	264	2640	రూ.7.23 కోట్లు
95వ వార్డు	190	1900	రూ.6.11 కోట్లు
96వ వార్డు	392	3920	రూ.12.63 కోట్లు
97వ వార్డు	194	1940	రూ.6.64 కోట్లు
98వ వార్డు	47	470	రూ.1.32 కోట్లు



థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు, నాయకులు

ఎంతో మేలు జరిగింది



ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం కానీ జగన్‌బాబులా ప్రజలకు మేలు చేద్దామని నిరంతరం పనిచేసే ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు. మాకైతే డ్వాక్రా రుణమాఫీ ద్వారా ఎంతో మేలు జరిగింది. ఏడాదికి రూ.26,684 చొప్పున నాలుగేళ్లకు రూ.1,06,736 రుణమాఫీ అయింది. చాలా ఆనందంగా ఉంది.

– కిల్లి ముత్యవమ్మ, పినగాడి

వ్యాపారం బాగుంది



నేను, మా తోటికోడలు కలిపి స్త్రీ నిధిలో రుణం తీసుకున్నాం. దాంతో పాటు వైఎస్సార్ ఆసరా ద్వారా మా ఇద్దరికీ నాలుగు విడతల్లో కలిపి దాదాపు రూ.40 వేల వరకు లబ్ధి చేకూరింది. ఆ నగదుతో మా ఇంట్లోనే పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ పెట్టుకున్నాం. ఇప్పుడు వ్యాపారం బాగుంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఆదిరెడ్డి పల్లవి, రాయవరపువానిపాలెం.

క్లుప్తంగా

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో ఉత్సాహంగా గడుపుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలతో కాలక్షేపం చేశారు. సాయం సంధ్యా సమయంలో తీరంలో ఎంజాయ్ చేశారు.

నమో సూర్యభగవాన్

సింహాచలం: సింహగిరిపై కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అలాగే సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలో వేంజేసిన సప్త అశ్వవాహన సమేత సూర్యనారాయణస్వామి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు చేశారు.

సందడిగా లక్ష్మీనర్సయ్యమ్మ పేరంటాలు పరస



పూజలందుకున్న లక్ష్మీనర్సయ్యమ్మ

పెందుర్తి: సుజాతనగర్ ప్రాంత ఆరాధ్య దేవత లక్ష్మీనర్సయ్యమ్మ పేరంటాలు పరస ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెటగుళ్ల, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆటలతో పిల్లలు సందడి చేశారు. సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, చినముషిడివాడ, పురుషోత్తపురం ప్రాంతాల ప్రజలు పేరంటాలును దర్శించుకున్నారు.

వెంకటరావుకు భారత సేవారత్న పురస్కారం



వెంకటరావును సన్మానిస్తున్న తాసుబెల్లి ఫౌండేషన్ సభ్యులు

సబ్బవరం: మండలంలోని జోడుగుళ్ల ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక కార్యకర్త, శ్రీ బంగారమ్మతల్లి సేవా సమితి సభ్యుడు సింగంపల్లి వెంకటరావుకు తాసుబెల్లి ఫౌండేషన్ 25వ వార్షికోత్సం సందర్భంగా భారత సేవారత్న పురస్కారంతో సత్కరించింది. నగరంలోని అక్కయ్యపాలెంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ శంకరనాయుడు మాట్లాడుతూ వెంకటరావు కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రోగులకు తమ సహాయ సహకారాలు అందించారన్నారు.

జీవీఎంసీ దఫేదార్ల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దఫేదార్లు

ఆరిలోవ: జీవీఎంసీ దఫేదార్ల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ముడసర్లోవ పార్కులో ఘనంగా జరిగింది. సుమారు 150 మంది దఫేదార్లు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అతిథులుగా పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొని దఫేదార్లతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో సీహెచ్ నారాయణ్, గణపతి, నరేష్, సింహాచలం, అప్పారావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

త్వరలో థీమ్ పార్కు ప్రారంభోత్సవం



థీమ్ పార్కులో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు రత్నగిరినగర్‌లో ఏర్పాటు అవుతున్న స్పోర్ట్స్ థీమ్ పార్కును త్వరలో ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ ముమ్మన దేముడు వెల్లడించారు. రత్నగిరినగర్‌లో నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ థీమ్ పార్కును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ రూ.1.94 కోట్లతో ఈ పార్కును జీవీఎంసీ అభివృద్ధి చేస్తుందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా ఏర్పాట్లను పరిశీలించారు. నాయకులు ఆకుల గుణాకర్, బొడ్డు దేముడుబాబు, సుంకర శేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: వేపగుంట సమీపంలోని చీమలాపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని చీమలాపల్లి 11కేవీ, పురుషోత్తపురం 11కేవీ,వేపగుంట 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వేపగుంట, చీమలాపల్లి, పొర్లుపాలెం, వరలక్ష్మినగర్, గంగిరెడ్ల కాలనీ, ముత్యమాంబకాలనీ, లక్ష్మీపురం, గవరపాలెం, చింతలగ్రహారం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా విర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు రఘునాథ్ , పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అ'పూర్వ' సమ్మేళనం



యారాడ అగ్రిగోల్డ్ పార్కులో పూర్వ విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు యారాడలోని అగ్రిగోల్డ్ పార్కులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. అలాగే తమతో పాటు కలసి చదువుకున్న సహచర మిత్రులు ఆర్థిక సమస్యలతో బాధపడుతుంటే ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ముందుగా తమతో కలిసి చదువుకుని మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీత నాగరాజు, ఈశ్వరరావు, మహ్మద్ వల్లీ, గోవింద్, బోగేష్, వెంకటేష్, కండిపల్లి సత్యనారాయణ, గొందేశి అరుణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రి వైభవం..రష్యన్ భక్తుల పరవశం



రష్యా భక్తులను సత్కరిస్తున్న వెంకటాద్రి ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై విదేశీ భక్తులు సందడి చేశారు. ప్రముఖ మాస్టర్ ఈకే సంస్థ అధ్యక్షుడు అనంత కృష్ణ ఆహ్వానం మేరకు రష్యాకు చెందిన భక్తులు ఇక్కడి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక పురుష సూక్త పారాయణ జరిపారు. అనంతరం ఆలయ ప్రతినిధులు రష్యన్ భక్తులను ఘనంగా సత్కరించి ప్రసాదం అందించారు. ఇక్కడి వాతావరణాన్ని చూసి రష్యన్ భక్తులు పారవశ్యంలో మునిగిపోయారు. స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని వారు తెలిపారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయరూ!



వెంకటపతిపాలెం వద్ద ప్రమాదకరమైన మలుపు

పరవాడ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రమాదకరమైన మలుపులు ప్రయాణికులను నిత్యం భయపెడుతున్నాయి. మలుపులను గుర్తించలేక యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. యువత వాహనాలను ఇష్టానుసారంగా వేగంగా నడుపుతూ మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో సుమారు 12 ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. వీటి వద్ద స్పీడు బేకర్లు ఏర్పాటు చేయలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో వాహనాలను వేగంగా నడుపుతూ ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తూ వారు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు.

- పరవాడలో సినిమాహాలు కూడలి, సబ్‌స్టేషన్ కూడలి, మండల కాంప్లెక్సు కూడలి, ఊటగెడ్డ కూడలి ప్రాంతాల్లోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. – భర్నికం వద్ద మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. – వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో గొల్లపేట, పీహెచ్‌సీ ఆస్పత్రి వద్ద మలుపులు ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్నాయి.
- జాజులవానిపాలెం–కలపాక రహదారిలో అనేక మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఈ రహదారిలో ప్రయాణిస్తూ మలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు.
- పెదముషిడివాడ వద్ద ప్రమాదకరమైన మలుపులో తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని పలువురు సూచిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొట్టాలి



1081వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న జరుగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 1081 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇక పై అటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే కాకుండా ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

7న చలో ఢిల్లీ



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల 7న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉక్కు సీడబ్ల్యూసీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలారని, వారికి ఎటువంటి ఉపాధి కల్పించకపోవడంతో ఇళ్లల్లో పాచి పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ విజేత కస్టమర్స్ ఎలెవెన్



ఇరు జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి

ఉక్కునగరం: ఉక్కు స్టేడియంలో స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్, కస్టమర్స్ ఎలవెన్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో కస్టమర్స్ ఎలెవెన్ జట్టు గెలుపొందింది. కస్టమర్లతో సత్సంబంధాల పెంపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం టీ–20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన కస్టమర్స్ ఎలెవన్ జట్టు 20 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్ జట్టు 20 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 131 పరుగులు మాత్రమే చేసింది. స్టీల్‌ప్లాంట్ జట్టుకు డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి కెప్టెన్‌గా వ్యవహరించగా కస్టమర్స్ జట్టుకు నగేష్ కెప్టెన్‌గా జట్టుకు నేతృత్వం వహించారు. అనంతరం డి.కె. మొహంతి, నగేష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. స్టీల్ ప్లాంట్ జట్టుకు చెందిన డాక్టర్ నవీన్ బెస్ట్ బ్యాటర్‌గా, కస్టమర్స్ జట్టుకు చెందిన రామారావులు బెస్ట్ బౌలర్‌గా బహుమతులు అందుకున్నారు.

ముగిసిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్‌ఎంఈల కోసం వారం రోజుల పాటు నిర్వహించిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎండీపీ) కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఎంఎస్ఎంఈ – డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ కార్యాలయం, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) విశాఖపట్నం సహకారంతో ఆటోనగర్‌లోని వాసీవాలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వాహణ అభివృద్ధి కార్యక్రమాన్ని (ఎండీపీ) నిర్వహించింది. ట్రేడ్ మార్కుల నమోదు, జీఈఎం, ఉత్పత్తి ప్రమాణాలు, సోషల్ మీడియా మార్కెటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 19 మంది మహిళ పారిశ్రామికవేత్తలతో పాటు 30 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి.కృష్ణవీర్ వర్మ, విశాఖపట్నం ఎంఎస్ఎంఈ – డీఎఫ్ఓ, ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ చంద్రమౌళి జంగం, వాసీవా కోశాధికారి పి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

30న దుకాణాలు, మార్కెట్లకు వేలం

కంచరపాలెం: జోన్–5 పరిధిలోని పలు వార్డుల్లో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 30న జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సంజీవయ్య కాలనీ, అశోక్‌నగర్, గుల్లలపాలెంలోని దుకాణాలకు, కంచరపాలెం నేతాజీ వంతెన నుంచి మర్రిపాలెం వరకు, అక్కయ్యపాలెంలో రోడ్డు పక్కన మార్కెట్లు, జనతా కాలనీలో కారం మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు, మాధవధారలోని మాధవ స్వామి కల్యాణ మండపానికి వేలం జరుగుతుందని చెప్పారు. వేలం పాటలో పాల్గొనే ఔత్సాహికులు మంగళవారం ఉదయం పేర్లు నమోదు చేసుకోవాలని జెడ్సీ కోరారు.

విద్యతో పాటు మానవీయ విలువలు అవసరం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్య సాయి విద్యావిహార్ 38వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ బసంత్ కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యా విహార్ విద్యార్థుల సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్పృహ, సేవా నిరతిని అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యా సంస్థ కృషి అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యతో పాటు మానవీయ విలువలు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ప్లాస్ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని, గాయని శిరీషాతో పాటు పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.